ప్రజాశక్తి
శుక్రవారం 16 ఫిబ్రవరి 2024

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు మామిడిపల్లి వాసి

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని మామిడిపల్లికి చెందిన సర్లంగి యశోద రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 16నుంచి 18 వరకు రాజమండ్రి లో జరుగనున్న రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు అర్హత సాధించినట్లు ఆమె కోచ్ శ్రీరాములు చెప్పారు. ఈ నెల 11న విజయనగరం డిఎస్ఎ ఇండోర్ స్టేడియంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన జిల్లాస్థాయి బాడ్మింటన్ సింగిల్స్ విభాగంలో ద్వితీయ స్థానంలో, డబుల్స్ విభాగంలో ప్రథమ స్థానంలో యశోద నిలిచింది. దీంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయింది. ఈమె స్పోర్ట్స్ కోటాలో సచివాలయం ఎఎన్ఎం ఉద్యోగాన్ని సాధించింది. ఇప్పుడు ఆమె విజయనగరం మహారాజా ఆసుపత్రిలో స్టాఫ్ నర్స్‌గా పనిచేస్తోంది.

- మోడీ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై సమర శంఖం
- నేడు నగరంలో రైతు కార్మిక సంఘాల భారీ ప్రదర్శన
- కలెక్టరేట్ ఎదుట ధర్నా

నేడు గ్రామీణ భారత్ బంద్

కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు,కార్మిక వ్యతిరేక విధానాలపై శుక్రవారం గ్రామీణ భారత్ బంద్ చేపట్టేందుకు జిల్లాలో ఉన్న కార్మిక,రైతు సంఘాలు సిద్ధమయ్యాయి. మరోవైపు కార్మిక వ్యతిరేక చట్టాల రద్దుకు వారంతా సమ్మె చేయనున్నారు. బంద్, సమ్మెను జయప్రదం చేసేదుకు ఇప్పటికే జిల్లాలో అనేక సమావేశాలు పెట్టి పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు.

ప్రజాశక్తి- పార్వతీపురం

కేంద్ర బిజెపి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పరచకుండా మోసగించింది. వ్యవసాయం, పరిశ్రమలు గనులు విద్యుత్, అటవీ సంపదలను, రవాణా, బ్యాంకులు, ఎల్ఐసి తదితర సంస్థలన్నిటినీ అదానీ, అంబానీ తదితర కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తోంది. కార్పొరేట్ కంపెనీల లాభాలకు ఆటంకంగా ఉన్న కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కార్మిక కోడ్లు తెచ్చింది. రైతాంగ ఉద్యమానికి తలవంచి వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేసినట్లు ప్రకటించినా జీవోలు ఇవ్వకపోగా, మరో రూపంలో వాటిని అమలుపరచేందుకు చూస్తోంది. విద్యుత్ చట్ట సవరణ బిల్లు పార్లమెంటు ముందు పెట్టింది. కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు ఇచ్చిన ప్రభుత్వం సామాన్య ప్రజల నిత్యవసర వస్తువులన్నింటిపైనా జిఎస్‌టి పేరిట పన్నులు పెంచి అన్ని రకాల ధరలను పెంచి సామాన్యులపై మోయలేని భారాలు వేసింది. గత పదేళ్లలో బిజెపి ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల అదానీ, అంబానీలు ప్రపంచ కుబేరుల జాబితాలో చేరగా పేద రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు లక్షా యాభైవేల మంది ఆత్మహత్యలు చేసుకున్నారు.

బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి మరింత ద్రోహం చేసింది. ప్రత్యేక హోదాను నిరాకరించింది. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ఇవ్వాల్సిన ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయడం లేదు. జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం నిర్వాసితులు నష్టపరిహారం, పునరావాసం తనకు సంబంధం లేదంటుంది. రైల్వే జోన్ ఎగనామం పెట్టింది. తెలుగు ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అమ్మకానికి పెట్టింది. రాజధాని నిర్మాణానికి పట్టెడు మట్టితో సరిపెట్టింది.

ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని వేధింపులకు గురిచేస్తూ, అక్రమ కేసులు బనాయిస్తోంది. రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తోంది. రాష్ట్రాల హక్కులను హరించి వేస్తుంది. మతోన్మాదాన్ని పెంచి పోషిస్తుంది. కేంద్ర బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక, కార్మిక వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని రైతు, కార్మిక ప్రజా అనుకూల విధానాలకై పోరాడాలని, కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక, సంయుక్త కిసాన్ మోర్చాలు పిలుపు ఇచ్చాయి.

ఇవీ డిమాండ్లు

- స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలి. రైతు రుణాలు మాఫీ చేయాలి.
- నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి. కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలి
- ఉపాధిహామీకి కేంద్ర బడ్జెట్లో రూ. 2లక్షల కోట్లు కేటాయించి, 200 రోజులకు పెంచాలి. వేతనం రూ.600కు పెంచాలి. 2 పూటల పని, ఆన్‌లైన్ మస్టర్ రద్దు చేయాలి.
- ఆహార భద్రత చట్టాన్ని పటిష్ఠ పరచాలి.
- విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలి
- విద్యుత్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించాలి, స్మార్ట్ మీటర్ల బిగింపును నిలుపుదల చేయాలి.
- భూహక్కుల చట్టం 27/23 ను ఉపసంహరించాలి.
- చుక్కలభూములు, బంజరు భూములన్నిటికి పట్టాలు ఇవ్వాలి.
- రైతుల ప్రయోజనాలకు అనుగుణంగా సమగ్ర పంటల భీమా పథకం పెట్టాలి. సాగులో ఉన్న కౌలు రైతులకే నష్టపరిహారాలు, బీమా సౌకర్యం ఇవ్వాలి.
- అటవీ హక్కుల చట్టం సవరణలు ఉపసంహరించాలి. ఆదివాసుల హక్కులను కాపాడాలని.
- బంద్‌లో భాగంగా విజయనగరం జిల్లా కేంద్రంలో కోట జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన,కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నారు. అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు. జిల్లాలో ఉన్న రైతు సంఘాలు,కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ బంద్ లో కర్షకులు,కార్మికులు పాల్గొననున్నారు.

ఈ నేపథ్యంలో శుక్రవారం దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్ నిర్వహించాలని, పరిశ్రమల అన్నింటిలో కార్మిక సమ్మె జరపాలని నిర్ణయించాయి.

అన్ని రైతు , కార్మిక సంఘాలు, అసోసియేషన్లు, ఫెడరేషన్లు, వినియోగదారుల సంఘాలు, వృత్తి సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన, మహిళా, సాంస్కృతిక సంఘాలు గ్రామీణ బంద్‌ను, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని ఇప్పటికే పిలుపునిచ్చాయి.

నేటి గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఈనెల 16న జరిగే గ్రామీణ బంద్, పట్టణ సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు, రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో సిఐటియు, రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం జరగబోయే గ్రామీణ బంద్, పట్టణ సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలు పంచుతూ ప్రచారం చేస్తూ మాట్లాడారు. స్థానిక పాతబస్టాండు మార్కెట్ యార్డ్ వివిధ కేంద్రాల్లో ఆటో ద్వారా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు మాట్లాడుతూ రైతులు, కార్మికులు, ఉద్యోగులపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాయని వాటికి నిరసనగా దేశవ్యాప్తంగా జరుగుతున్న గ్రామీణ బందును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ, నాయకులు బి.సూరిబాబు, పి.రాజశేఖర్ పాల్గొన్నారు.

కురుపాం : కేంద్రప్రభుత్వం గిరిజన, రైతు, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు, రాష్ట్రానికి చేసిన ద్రోహానికి నిరసనగా అన్ని ప్రజా సంఘాలు కలిసి దేశవ్యాప్తంగా శుక్రవారం తలపెట్టిన బంద్‌ను, ర్యాలీ, నిరసన సభల్లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కిసాన్ మోర్చా కార్మిక సంఘాల నాయకులు కోరాడ ఈశ్వరరావు కోరారు. దేశవ్యాప్తంగా సమ్మె సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు బిడ్డికి వాసుదేవరావు, బి.అనిల్ కుమార్ ఆధ్వర్యంలో భారామని, సవర గూడ, ఎర్రగుడ్డి, గుంజరాడ మొండెంఖల్‌లో సమ్మె విజయవంతం చేయాలని ప్రచారం నిర్వహించారు.

కొమరాడ : దేశ వ్యాప్తంగా శుక్రవారం జరుగు గ్రామీణ భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని సీసాడవలసలో ప్రచారం నిర్వహించారు. గ్రామీణ బంద్‌లో కార్మికులు, వ్యవసాయ కూలీలు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పాలకొండ : గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని వెలగవాడలో వ్యవసాయ కార్మికసంఘం నాయకులు దూసి దుర్గారావు ప్రచారం నిర్వహించారు. దేశవ్యాప్తంగా శుక్రవారం జరుగు ఈభారత్ బంద్‌లో కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

బిజెపితో జతకట్టే పార్టీల్లో ఉండలేను

కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిశోర్ చంద్రదేవ్

ప్రజాశక్తి - కురుపాం



మతతత్వ పార్టీ అయిన బిజెపితో జత కట్టిన ఏ పార్టీలోనూ ఉండలేనని కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిశోర్ చంద్రదేవ్ అన్నారు. గురువారం సాయంత్రం తన కోటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపికి రాజీనామా చేయడానికి ముఖ్య కారణం బిజెపితో జతకట్టడమేనన్నారు. అప్పట్లో తాను టిడిపిలోకి చేరడానికి కారణం ఆ పార్టీ ఎన్‌డిఎ నుంచి బయటకి రావడమేనని అన్నారు. చంద్రబాబు అరెస్టుకు కారణమైన పార్టీతో పొత్తు పెట్టుకోవడం ఏమిటని ప్రశ్నించారు. టిడిపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక్కరోజు కూడా చంద్రబాబు అసెంబ్లీకి వెళ్లలేదని, మనకు ప్రజలు ఓట్లు వేసి న్యాయ బద్ధంగా గెలిపించినప్పుడు అసెంబ్లీలో ప్రజల గొంతును వినిపించాలని, అలాంటిది చంద్రబాబు విస్మరించారని విమర్శించారు. చంద్రబాబు అరెస్ట్ వెనుక బిజెపి ఉందని తనకున్న సమాచారమని, అటువంటి పార్టీతో పొత్తు పెట్టుకున్న టిడిపి పార్టీలో ఉండలేనని స్పష్టం చేశారు. బిజెపి హయాంలో హింస మతఘర్షణలు ఎక్కువయ్యాయని, మత విద్వేషాలు సృష్టిస్తున్న బిజెపికి ఇలా లొంగిపోయి టిడిపి పొత్తు పెట్టుకుంటుందని తాను అనుకోలేదని అన్నారు. ఏ రాష్ట్ర ముఖ్యమంత్రులు మోడీని కలవడానికి వెళ్ళలేదనీ కానీ చంద్రబాబు ఎందుకు అన్ని సార్లు వెళ్తున్నారో అర్థం కావడం లేదని అన్నారు. టిడిపి కనుసన్నల్లో నడుస్తుందని, అటువంటిప్పుడు న్యాయం రాష్ట్రానికి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. టిడిపి, వైసిపి ఇక్కడ తిట్టుకుంటూ కొట్టుకుంటూ కేంద్రంలో మోడీకి మద్దతు చేస్తున్నాయని అటువంటి పార్టీకి దాసోహం అవ్వాల్సిన అవసరమేంటని అన్నారు. కారణాలు ఆలోచించకుండా పొత్తు పెట్టుకోవడం వల్ల పార్టీకి రాజీనామా చేస్తున్నని తెలిపారు. భవిష్యత్తు కార్యాచరణ ఏమిటని విలేకరులు ప్రశ్నించగా, ఇంకా ఏ నిర్ణయమూ తీసుకోలేదని చెప్పారు.

గుమ్మడిగూడ, రంగంవలస సమీపంలో ఏనుగులు

ప్రజాశక్తి - సీతంపేట

ఏజెన్సీలో గత ఐదు రోజులుగా ఏనుగులు సంచరిస్తున్నాయి గురువారం గుమ్మడి గూడ రంగం వలస పరిసర ప్రాంతాల్లో ఏనుగులు సంచరించడంతో గిరిజనులు బయూ ఆందోళన చెందుతున్నారు ఏనుగులు గీంకారాలతో గిరిజనులకు కంటిమీద కునుకు లేకుండా పోతుంది. గిరిజనులు కొండపోడుకు వెళ్లాలంటే భయం ఆందోళన చెందుతున్నారు ఎప్పుడు గ్రామాల్లోకి ఇళ్లల్లోకి చొరబడతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

ఎన్నికల్లో పోలీసుల పాత్ర కీలకం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

రానున్న సాధారణ ఎన్నికల నిర్వహణలో పోలీసుశాఖ విధులు కీలకమని కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీసు సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళిలో ప్రతి విషయంపై పూర్తి అవగాహన ఉండాలని అందుకు గానూ నియమావళిని ప్రతి ఒక్కరూ చదివి తెలుసుకోవాలన్నారు. సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన క్షణం నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందన్నారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో బందోబస్తు ప్రణాళిక, పోలీసింగు సమయంలో విధులు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, బందోబస్తు, ఎన్నికల సమయంలో మద్యం, గంజాయి, డబ్బు రవాణా నిరోధించేందుకు తదితర అంశాల్లో పోలీసులు అవగాహన, ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. ఎస్‌పి విక్రాంత్‌పాటిల్ మాట్లాడుతూ ఎన్నికల విధులపై పోలీసు అధికారులకు సిబ్బందికి అవగాహన ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రంలోకి పోలీసులు ప్రవేశించకూడదన్నారు. మారుమూల ప్రాంతాల్లో పనిచేస్తున్న సిబ్బంది అప్రమత్తంగా మెలగాలని, ప్రతి అంశాన్ని ఉన్నతాధికారులకు తెలపాలని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, బందోబస్తు విధులు విజయవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. శిక్షణా కార్యక్రమంలో ఎన్నికలకు ముందు, తర్వాత విధులు, పోలింగ్ ప్రక్రియ, నామినేషన్ల స్వీకరణ, బందోబస్తు, నామినేషన్ల స్క్రూటినీ, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ జి.కేశవనాయుడు, డిఎస్‌పి మురళీధర్, సిఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వాలంటీర్లను సన్మానిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, ప్రభుత్వ విప్ విక్రాంత్, ఎమ్మెల్యే జోగారావు

వాలంటీర్ల సేవలు మరువలేనివి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆపత్కాల సమయాల్లో వాలంటీర్లు అందించిన సేవలు మరువలేనివని కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో వాలంటీర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ గ్రామస్వరాజ్యాన్ని అందించే క్రమంలో వాలంటీరు పాత్రకీలకమని తెలిపారు. ప్రభుత్వ పథకాలు అవసరమైన వారి చెంతకు చేర్చడం, పంపిణీ చేయడం ద్వారా ప్రభుత్వానికి మంచిపేరు తీసువస్తున్నారన్నారు. అనంతరం కలెక్టర్ మట్లాడుతూ వాలంటీర్లకు వందనం కార్యక్రమం ద్వారా వారికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం 50 శాతం పెంచి సేవావజ్ర అవార్డుకు రూ.45వేలు, సేవారత్న అవార్డుకు రూ.30 వేలు, సేవా మిత్ర అవార్డుకు రూ.15వేలు అందించడం సంతోషదాయకమని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న వాలంటీర్లలో 5368 మంది సేవా మిత్రకు, 90 మంది సేవా రత్నకు, 20 మంది సేవా వజ్ర విశిష్ట సేవలకు వెరశి 5478 మంది ఎంపికయ్యారని తెలిపారు. వాలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేస్తూ, స్వలాభేక్ష లేకుండా సేవలు అందిస్తున్నారని తెలిపారు. అనంతరం సేవా వజ్రలకు ఎంపికైన 20 మంది వాలంటీర్లకు రూ. 45వేలు నగదు, ధ్రువపత్రం, మెడల్, శాలువా అందజేశారు. అలాగే సేవారత్నకు రూ.30వేలు నగదు, ధ్రువపత్రం, మెడల్, శాలువా, సేవామిత్రకు రూ.15వేలు, ధ్రువపత్రం, మెడల్, శాలువా బహూకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, వాలంటీర్లు పాల్గొన్నారు.

టెన్త్‌లో ఉత్తీర్ణత పెంచాలి : డిఇఒ

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

పదో తరగతిలో ఉత్తీర్ణత పెంచాలని జిల్లా విద్యాశాఖాధికారి పగడాలమ్మ అన్నారు. మండలంలోని ఎంఆర్ నగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె గురువారం అధికారులతో కలిసి పరిశీలించారు. ముందుగా కళాశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. భోజన పదార్థాలను రుచి చూచి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశమై పదోతరగతి విద్యార్థుల పరీక్షల సన్నద్ధత గురించి, వారికి నిర్వహిస్తున్న ప్రత్యేకతల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎట్టి పరిస్థితిల్లోనూ ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని ఉపాధ్యాయులను కోరారు.

వైసిపి పాలనలో ప్రజలు దగా

- బొత్స, బెల్లాన పట్టించుకోలేదు
- మాయమాటలు నమ్మితే మరింత దోపిడీ
- శంఖారావం సభల్లో లోకేష్



చీపురుపల్లి సభలో మాట్లాడుతున్న లోకేష్

సభకు హాజరైన ప్రజలు

ప్రజాశక్తి-రేగిడి, చీపురుపల్లి

వైసిపి పాలనలో ప్రజానీకం దగాపడ్డారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. ఈ జిల్లాను మంత్రి బొత్స, ఎంపి బెల్లాన పట్టించుకోలేదని విమర్శించారు. టిడిపి చేపట్టిన శంఖారావంలో భాగంగా రాజాం, చీపురుపల్లిలో గురువారం ఏర్పాటు చేసిన సభల్లో లోకేష్ మాట్లాడారు. ఉత్తరాంధ్రకు పట్టిన దరిద్రం జగన్ అని, మూడు రాజధానుల పేరిట మూడుముక్కలాట ఆడుతున్నారని అన్నారు. వైవి సుబ్బారెడ్డి, బొత్స సత్యనారాయణ, విజయసాయి రెడ్డి కుటుంబాలకు ఉత్తరాంధ్రను అప్పగించారని, ఈ మూడు కుటుంబాలు ఏం పీకాయని ప్రశ్నించారు. ఉత్తరాంధ్రకు పరిశ్రమలు తెచ్చారా? ఇళ్లు నిర్మించారా? నీళ్లు ఇచ్చారా? రోడ్లు వేశారా? అంటూ ప్రశ్నించారు. పాదయాత్రలో జగన్ ఈ జిల్లాకు 50 హామీలిచ్చినా ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. జిల్లాలో పరిశ్రమలు మూతపడి నా ఇక్కడి పాలకులకు పట్టడం లేదన్నారు. రహదారులు స్విమ్మింగ్ పూల్‌ను తలపిస్తున్నాయని అన్నారు. పాలిచ్చే ఆవును కాదని.. తన్నే దున్నపోతును ప్రజలు తెచ్చుకున్నారని అన్నారు. సీనియర్ నేత అయిన మంత్రి బొత్స జగన్‌ను ఎందుకు అభివృద్ధిపై నిలదీయడం లేదన్నారు. దీనికి కారణం ఆయన చేసే అవినీతి అని, ఆయన పెన్నులోని ఇంకు అవినీతికి వాడుతున్నాడు తప్ప అభివృద్ధికి కాదని విమర్శించారు. 5 ఏళ్లుగా ఇక్కడి ప్రజలకు ఒక్క మంచిపనైనా బొత్స చేశారా అని ప్రశ్నించారు. రైల్వే బ్రిడ్జి పనులు ఆగిపోయినా రాష్ట్ర నిధులు ఇవ్వలేదని, దీనిపై బొత్స ఎందుకు శ్రద్ధ పెట్టడం లేదని అన్నారు. బొత్స కుటుంబం విజయనగరానికి కేన్సర్ గడ్డలా పట్టుకుందని, ఈ గడ్డ పోవాలంటే రేడియేషన్ చేయాలని, ప్రజలంతా వచ్చే ఎన్నికల్లో బటన్ నొక్కి రేడియేషన్ ఇవ్వాలని అన్నారు. ఆర్ఇసిఎస్‌ను ఎందుకు ప్రభుత్వంలో విలీనం చేశారని, రిటైర్డ్ ఎక్స్ సర్వీస్ భూములు, పేదల భూములు ఎందుకు కబ్జా చేశారని ఆరోపించారు. వీరిమాయమాటలు నమ్మితే ఇంటి పైకప్పు కూడా దోచుకుంటారని, ఈ కుటుంబాన్ని ఏకంగా ఇప్పుడు వైజాగ్‌కు పంపుతున్నారని, అక్కడా దోపిడీకి సిద్ధమవుతున్నారని అన్నారు. ఇక్కడి ఎంపీ బెల్లాన చంద్రశేఖర్.. జిల్లా కోసం పార్లమెంట్‌లో ఏం చేశారు ప్రశ్నించారు. కనీసం రైల్వే బ్రిడ్జి పూర్తి చేయలేని దద్దమ్మ మనకు అవసరమా? అంటూ ప్రశ్నించారు. అభివృద్ధి చేయని పాలకులు మనకు వద్దని, టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా రాజాం, చీపురుపల్లి నియోజకవర్గాలకు పలు హామీలు ఇచ్చారు.

రాజాంలో సభకు అధ్యక్షత వహించిన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోండ్రు మురళీమోహన్ మాట్లాడుతూ వైసిపి నుంచి టిడిపిలోకి పలువురు చేరారు. వారికి లోకేష్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. చీపురుపల్లి సభలో నియోజకవర్గంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జున మాట్లాడుతూ మంత్రి బొత్స నాలుగున్నరేళ్లలో సంవత్సరాల్లో చీపురుపల్లికి ఏంచేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సభల్లో ఆయా నియోజకవర్గాల జనసేన సమన్వయ కర్తలు శ్రీనివాసరావు, వై.రాజు, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న విద్యార్థులుద తల్లిదండ్రులు

టీచర్‌ను నియమించాలని ధర్నా

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తమ గ్రామంలోని ఎయిడెడ్ పాఠశాలకు ఉపాధ్యాయుడ్ని నియమించి తమకు విద్యను అందించాలనికోరుతూ మండలంలోని పి.ఆమిటి విద్యార్థులు, తల్లిదండ్రులు గ్రామస్తులతో కలిసి గురువారం పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. నేటి బాలలే రేపటి పౌరులు, ప్రాథమిక విద్య అందరి బాధ్యత, ఉపాధ్యాయులైన నియమించాలంటూ నినాదాలు చేశారు. అనంతరం గిరిజనులు మాట్లాడుతూ తమ గ్రామంలోని ఎయిడెడ్ పాఠశాలకు ఉపాధ్యాయుల్లేకపోవడంతో చదువుకు దూరమయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి ఉపాధ్యాయుడు 2021లో మరణించినప్పటి నుంచి ఇప్పటి వరకూ ఉపాధ్యాయుడ్ని నియమించకపోవడంతో గ్రామంలో విద్యార్థులకు ప్రాథమిక విద్య అందడం లేదని సర్పంచ్ తాడంగి దమయంతి అన్నారు. దీంతో 22మంది చిన్నారులు ప్రతిరోజు గోపాలపురానికి వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రతిరోజు వెళ్లి రావడంతో ఎండకు, వర్షానికి ఇబ్బందులు పడుతూ విద్యార్థులు అష్టకష్టాల నడుమ చదువులు సాగించాల్సి వస్తుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఉపాధ్యాయులను నియమించాలని ఎన్నోసార్లు అధికారులకు విన్నవించినా కనీసం స్పందించలేదన్నారు.

ఇదే సమస్య గత కొన్నేళ్లుగా డుమ్మంగి, బొడ్డిడి గ్రామాల్లో కనిపిస్తోంది. ఇక్కడ ఉన్న ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ పొంది ఏళ్లు తరబడుతున్నా వారి స్థానంలో కొత్తవారిని ప్రభుత్వం నేటికీ నియమించకపోవడం శోచనీయం. దీంతో ఇక్కడ విద్యార్థులు గుమ్మలక్ష్మీపురం, కొత్తగూడ తదితర ప్రాంతాలకు వెళ్లి చదువులు సాగించాల్సిన పరిస్థితి. ఈ సమస్యపై గ్రామస్తులు పలుమార్లు ఆందోళన బాట చేపట్టినా ఏ అధికారీ స్పందించలేదు. ఏజెన్సీలో గిరిజన విద్యకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని ప్రకటనలు చేస్తున్న పాలకులు, అధికారులు ఇటువంటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉపాధ్యాయులను నియమించడం ద్వారా ప్రాథమిక విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని గిరిజన సర్పంచులు కోరుతున్నారు.

మా నేతల మాట వినకపోతే మీ మాటలు వినాలా?

లోకేష్ వ్యాఖ్యలపై డిప్యూటీ సిఎం ఫైర్

ప్రజాశక్తి - సాలూరు

వైసిపి ఉమ్మడి జిల్లా నేతలు బొత్స సత్యనారాయణ,మజ్జి శ్రీనివాసరావు మాటలు వినకుండా టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ చెప్పింది వినాలా అని డిప్యూటీ సిఎం రాజన్నదొర ధ్వజమెత్తారు. గురువారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం శంఖారావం సభలో లోకేష్ చేసిన వ్యాఖ్యలపై రాజన్నదొర స్పందించారు. ఇటీవల మన్యం జిల్లా పర్యటనలో భాగంగా లోకేష్ వైసిపి ఎమ్మెల్యేలతో పాటు తనపై కూడా ఆరోపణలు చేశారని చెప్పారు. ఆ ముగ్గురు ఎమ్మెల్యేలపై ఏవో అవినీతి ఆరోపణలు చేసిన లోకేష్ తనపై భిన్నమైన వ్యాఖ్యలు చేశారని చెప్పారు. ఒకవేళ తనపై కూడా అవినీతి ఆరోపణలు చేస్తే ఘాటుగా స్పందించే వాడినని అన్నారు. వైసిపీ అగ్రనేతల సలహాలు, సూచనల మేరకు పార్టీని నడిపిస్తుంటే తప్పేంటి? ఇప్పుడు టిడిపి టిక్కెట్ ఆశిస్తున్న నాయకురాలు కూడా ఒకప్పుడు ఆ నేతల కింద పని చేశారని అన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను అన్న అని లోకేష్ సంబోధించడంపై మాట్లాడుతూ గతంలో పవన్ కల్యాణ్ టిడిపి నాయకులపై విరుచుకుపడిన విషయాన్ని గుర్తు చేశారు. దొడ్డిదారిన ఎమ్మెల్సీ అయిన పంచాయితీరాజ్‌శాఖ మంత్రిగా లోకేష్ ఈ నియోజకవర్గంలో ఎన్ని రోడ్లు, వంతెనలు, తాగునీటి సరఫరా పథకాలకు నిధులు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు నెలరోజుల ముందు పట్టణంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి రాత్రివేళ శంఖుస్థాపన చేశారని చెప్పారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.17 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు.

జీవో 3పై దొంగనాటకం

ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న గిరిజనులకు వందశాతం ఉద్యోగాలకు సంబంధించిన జీవో నెంబర్ 3 పై టిడిపి నాయకులు దొంగనాటకం ఆడుతున్నారని ధ్వజమెత్తారు. ఆ జీవో రద్దు కావడానికి కారణం టిడిపి ప్రభుత్వమేనని అన్నారు. దీనిపై కోర్టులో అప్పటి టిడిపి ప్రభుత్వం సరైన వాదన వినిపించనందునే రద్దు అయిందని చెప్పారు. 2020 ఏప్రిల్ లో కరోనా కాలంలో సుప్రీంకోర్టు తీర్పు విడుదలైందని చెప్పారు. వెంటనే వైసిపి ప్రభుత్వం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేసిందని చెప్పారు. ఇప్పుడు కోర్టులో ఉండగా ఆర్డినెన్సు తీసుకురావడం కుదరదని న్యాయనిపుణులు చెప్పారని తెలిపారు. గిరిజనులంటే టిడిపికి చులకన భావం వల్లనే చంద్రబాబునాయుడు ఏం విధమైన అభివద్ధి పనులు చేయలేదని చెప్పారు. గిరిజనులకు మంత్రివర్గంలో స్థానం ఇవ్వని ఘనత టిడిపిదేనని చెప్పారు. తానేమిటో నియోజకవర్గ ప్రజలకు బాగా తెలుసునని, రానున్న ఎన్నికల్లో వారే టిడిపికి తగిన గుణపాఠం చెబుతారని రాజన్నదొర అన్నారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, దండి శ్రీనివాసరావు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, కౌన్సిలర్లు గొర్లి వెంకటరమణ, రాపాక మాధవరావు, పాచిపెంట మండలం వైసిపి అధ్యక్షుడు జి.ముత్యాలు నాయుడు, మెంటాడ మండల నాయకులు ఈశ్వరరావు పాల్గొన్నారు.

రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంఇఒ సత్యనారాయణ, రాధాకృష్ణ

మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులకు అస్వస్థత

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ఆదర్శ పాఠశాల వద్ద మధ్యాహ్న భోజనం తిని ఇద్దరు విద్యార్థులు అస్వస్థత గురై, వాంతులు, కళ్లు తిరిగి పడిపోయిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఈ విషయం విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియడంతో గురువారం మధ్యాహ్న భోజన సమయంలో ఆదర్శ పాఠశాల వద్దకు వెళ్లి భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఎంఇఒకు ఫోన్ చేసి ఆదర్శ పాఠశాలలో భోజనం బాగోలేక విద్యార్థులు తీవ్ర అస్వస్థకు గురయ్యారని తెలిపారు. వెంటనే ఎంఇఒలు ఎస్.సత్యనారాయణ, రాధాకృష్ణ పాఠశాలను సందర్శించి, భోజనాలను పరిశీలించి ఎండిఎం నిర్వాహకులు, ఆదర్శ పాఠశాల సిబ్బందితో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో సిబ్బంది గాని నిర్వాహకులు గానీ రాజీ లేకుండా సక్రమంగా వండి అందించాలని సూచించారు. అనంతరం నిల్వ ఉన్న స్టాకును పరిశీలించగా కుళ్లిన గుడ్లు, కాలం ముగిసిన చోడిపిండి ప్యాకెట్లు నిల్వ ఉండడం వారి పరిశీలనలో బయట పడింది. అనంతరం విలేకరులతో వారు మాట్లాడుతూ భోజనం నాణ్యత లేకపోవడం వాస్తవమేనని, గురువారం నుంచి 15 రోజుల పాటు ప్రత్యేకంగా సిఆర్పిలు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో టీం వేసి ప్రతిరోజు పిల్లలకు ఎండిఎం వడ్డించే సమయంలో ఈ టీము రుచి చూసిన తరువాతే విద్యార్థులకు వడ్డించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అప్పటికీ సక్రమంగా వండక పోతే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఆర్పిలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుల తీరుపై జనసేన ఆగ్రహం

ప్రజాశక్తి - సాలూరు

ఎన్నికల శంఖారావంలో భాగంగా టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బుధవారం జరిగిన శంఖారావ సభకు టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. అయితే ఈ సభకు పట్టణానికి చెందిన జనసేన నాయకులకు శివశ్యామ్, పాచిపెంట మండలానికి చెందిన గొర్లి జగదీష్ వెళ్లగా వీరికి హాజరయ్యేందుకు కనీసం పాసులు కూడా టిడిపి నాయకులు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లుగా జనసేనను నమ్ముకున్న తమకు బాగా బుద్ధి చెప్పారని ఆవేదన వ్యక్తంచేశారు. టిడిపి నాయకుల తీరుపై ధ్వజమెత్తారు. పార్టీ నాయకత్వం అయిన వారికి ఆకులు, కానివారికి కంచాలు అన్న చందంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. లోకేష్ సభలో వేదికపై జనసేన అధ్యక్షులు లోకం మాధవి, నియోజకవర్గ సమన్వయకర్త గేదెల రిషివర్ధన్ ఆశీనులయ్యారు. మాధవి నెల్లిమర్ల ఎమ్మెల్యే సీటు ఆశిస్తున్న అభ్యర్థిగా జిల్లా ప్రజలకు అవగాహన వుంది. ఇకపోతే గేదెల రిషివర్ధన్‌ను ఆ పోస్టులో పార్టీ ఎప్పుడు నియమించిందో స్థానిక నాయకులు కార్యకర్తలకు తెలియదు. ఆయన ఎప్పుడూ నియోజకవర్గ సమస్యలపై గళం విప్పిన దాఖలాలు లేవు. పోరాడిన సందర్భాలు లేవు. మొదటి నుంచి పార్టీని నడిపిస్తున్న తమను టిడిపి నాయకులు అవమానించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

20న వాహనాల వేలం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక పోలీస్ స్టేషన్లో నాటు సారా రవాణా చేస్తూ పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 20న వేలం వేయనున్నట్టు సిఐ కృష్ణారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఈనెల 20న స్థానిక పట్టణ పోలీసు స్టేషన్ లో 6 ద్విచక్ర వాహనాలు (ఒక స్కూటీ, 05 మోటర్ సైకిల్) 1 కారు వేలం వేయనున్నట్లు తెలిపారు. ఈ వేలంపాటలో పాల్గొనే వారు ఆ రోజు ఉదయం 11.00 గంటలకు పోలీసు స్టేషనుకు వచ్చి, వాహనానికి నిర్ణయించిన కనీస ధరకు తక్కువ కాకుండా నిబంధనల ప్రకారం వేలంలో పాల్గొని, వాహనాలను కొనుగోలు చేసుకోవాలని తెలిపారు. పార్వతీపురం ఎఎస్పి సునీల్ షరాన్ సమక్షంలో ఈ వేలంపాట జరుగుతుందన్నారు. ఈనెల 16న నిర్వహించాల్సిన వేలంపాట అనివార్య కారణాల వల్ల ఈనెల 20కి మార్చినట్టు తెలిపారు.

ఇంటింటి కుళాయి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - కురుపాం

పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

మండలంలోని నీల కంఠాపురం పంచాయతీలో జలజీవన మిషన్ కింద మంజూరైన ఇంటింటికి తాగునీటి కుళాయిలు పనులు సర్పంచ్ ఎ.మన్మథరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలో నీలకంఠాపురం, దండుసుర, ధర్మ లక్ష్మీపురం, మహేంద్రపురం, జుంబిరి, మామిడిమానుగూడ గిరిజన గ్రామాలకు మొదట విడతగా జలజీవన మిషన్ కింద మంజూరైన పనులను ప్రారంభించామన్నారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని పంచాయతీలో అన్ని గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూస్తానన్నారు. అంతేకాక మిగతా గ్రామాలకు కూడా జలజీవన్ మిషన్ కింద ఇంటింటికి తాగునీటి కుళాయిలు అందించేలా చర్యలు చేపడతానన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నిరుపేద జంటలకు సామూహిక వివాహాలు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని మార్కొండపుట్టి పంచాయతీ పరిధిలోని బట్టి వలస గ్రామంలో నిరుపేద గిరిజన జంటలకు స్థానిక గ్రామస్తులు వేమూరి కోటేశ్వరరావు సహాయంతో బుధవారం రాత్రి సామూహిక వివాహాలు జరిపించారు. వేద పండితులు విద్యా గాయత్రీ ఉపాసకులు ఎస్ హేమ సుందరాచార్యులు ఆధ్వర్యంలో మాంగల్య ధారణ కార్యక్రమాలు జరిగాయి. 9గంటలకు ఒకే చోట స్థానిక ఆంజనేయ దేవాలయ ప్రాంగణంలో వివాహాలు జరపడం ఆనందంగా ఉందని గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేశారు. నూతన వధూవరులకు వివాహనికి అవసరమైన అన్ని సామాగ్రిలు ఉచితంగానే నిర్వాహకులు అందజేశారు. ఈ వివాహ వేడుకలో పెద్ద ఎత్తున గ్రామస్తులు చుట్టుపక్క గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

వేలం పాట వాయిదా

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా కేంద్రంలో 2024-25 సంవత్సరానికి సంబంధించి మున్సిపల్ రోజువారి మార్కెట్, మున్సిపల్ పరిధిలో గల పలు ఏరియాలలో రోడ్డు మార్జిన్ అశీలు వసూళ్లు చేసుకునేందుకు గురువారం నిర్వహించిన వేలం పాటకు ఎవరూ రాకపోవడంతో ఫిబ్రవరి 20వ తేదీన ఉదయం 11 గంటలకు వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ పొందూరు సింహాచలం తెలిపారు. అదే రోజు మున్సిపల్ వాణిజ్య భవన సముదాయంలో ఉన్న 22, 34, 36, 44, 45 నెంబర్ల షాప్‌లకు అద్దె ప్రాతిపదికన వేలంపాట నిర్వహిస్తామన్నారు. మున్సిపల్ కార్యాలయంలో వేలం పాటను బహిరంగంగా నిర్వహిస్తామని వేలంపాటలో పాల్గొనేవారు రూ.5 లక్షలు సాల్విన్ సర్టిఫికేట్‌తో పాటు రూ.4 లక్షలు ధరావత్తు మున్సిపల్ రెవెన్యూ అధికారులకు అందజేసి వేలం పాటలో పాల్గొనాలని, పూర్తి వివరాల కోసం కార్యాలయంలో పనిచేసే వేళలలో సంప్రదించాలని కోరారు.

దశమంతపురంలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని దశమంతపురంలో గురువారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులో పడి వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని వెంకటేశ్వరా కాలనీకి చెందిన వద్ధురాలు బోనుమహంతి సరోజిని (65) చెరువులో పడి మృతి చెందినట్లు టౌన్ ఎస్ఐ కెవి సురేష్ చెప్పారు. సరోజినీ కుమారుడు శ్రీను అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈనెల 13న సరోజిని ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని, ఎక్కడ వెతికినా కనిపించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారని చెప్పారు. గురువారం పట్టణం సమీపంలో చెరువులో శవమై కనిపించిందని చెప్పారు. దీనిపై తమకు ఎలాంటి అనుమానం లేదని కుమారుడు శ్రీను చెప్పినట్లు తెలిపారు.

కొనసాగిన సిహెచ్‌డబ్ల్యుల దీక్షలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ఆశలుగా మార్పు చేయాలని, కోరుతూ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ పార్వతీపురం ఐటిడిఎ ఎదుట చేపట్టిన సామూహిక నిరసన దీక్షలు రెండవ రోజు గురువారం కొనసాగాయి. వారికి మద్దతుగా సిఐటియు, సిపిఎం గిరిజన సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళా సంఘం కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ నాయకులు వి ఇందిర మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతాల్లో రహదారి సౌకర్యం లేక కొండలపై నివసిస్తున్న గిరిజన మహిళలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న వీరిని ఆశలుగా మార్చడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఐటిడిఎ నుండి రూ.10వేలు వేతనం ఇప్పించాలని, ఆశలకు వర్తింపచేసే అన్ని సౌకర్యాలు కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌కి అందజేయాలని అన్నారు. అనంతరం సిఐటియు కోశాధికారి జి.వెంకటరమణ, బి.సూరిబాబు గుర్తింపు కార్డులు యూనిఫామ్ ఇవ్వాలని కోరారు. గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలకు

పార్వతీపురం: నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

రంజిత్ కుమార్ మాట్లాడుతూ మహిళా సాధికారత అంటే గిరిజన మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని పాత బకాయిలు ఎన్నిసార్లు అడిగినా ఆ డబ్బులు చెల్లించలేదని 21 నెలలు వేతనాలు వేస్తామని రాతపూర్వకంగా ఇచ్చిన హామీ ఇప్పటివరకు నెరవేరలేదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మీనాక్షి, పార్వతి, కుసుమ, అప్పలనరసమ్మ, అరుణ, హైమా,పద్మ తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక ఐటిడిఎ కమ్యూనిటీ హెల్త్‌వర్కర్లు తలపెట్టిన సామూహిక దీక్షలు గురువారం రెండో రోజు కూడా కొనసాగాయి. ఈ దీక్షలనుద్దేశించి సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం.కాంతారావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన ప్రాంతాల్లో పని చేసే 2361 మంది కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను అశాలుగా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. ఆశాలతో సమానంగా వేతనం, ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. యూనిఫాం, రికార్డ్ మెడికల్ కిట్లు, టిఎ, డిఎలు ఇవ్వడంలేదన్నారు. గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు సేవలందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హెల్త్ కమ్యూనిటీ వర్కర్లు ఎస్.శిరీష, ఎన్.రంభ, కె.శ్రీలత, బి.కమల, ఎస్.సుమెని, ఎన్.శ్రీదేవి, ఎస్.కళావతి, కె.కాంతమ్మ, కె.సుశీల, తదితరు పాల్గొన్నారు.

రెండో రోజూ ఉద్యోగుల నిరసనలు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

రాష్ట్రంలో 15 లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్, డైలీ అండ్ ఫుల్ టైమ్ వర్కర్స్ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తాత్సారం చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక అండ్ పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి (ఎపి జెఎసి) చైర్మన్, కో చైర్మన్ జివిఆర్ కిషోర్, అన్నారు. జెఎసి ఉద్యమ కార్యాచరణలో భాగంగా గురువారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో జిల్లా ట్రెజరీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగికి ఆర్థిక, ఆర్థికేతర సమస్యలు ఉన్నాయన్నారు. వాటిన్నింటిని ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 16న కూడా భోజన విరామ సమయంలో నిరసనలు తెలియజేస్తామని, 17న ర్యాలీలు, 20న కలెక్టర్ ఆఫీసు ముందు నిరసన, 27న

ట్రెజరీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

చలో విజయవాడ చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎన్‌జిఒ పింఛనర్లు, వైద్య శాఖకు చెందిన క్లాస్ ఫోర్ ఉద్యోగులు, పంచాయతీరాజ్ శాఖ, మున్సిపాలిటీ, వార్డు సచివాలయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

బలిజిపేట : ఉద్యోగుల సమస్యల సాధనకై ఉద్యమ కార్యాచరణ చేపడుతున్నట్లు ఎపి ఎన్‌జిఒ జిల్లా ఉపాధ్యక్షులు జె విక్టరీ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట గురువారం నల్ల బ్యాడ్జీలతో మండల సచివాలయ ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డిఎలను విడుదల చేయాలని, పిఆర్సి బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి తాలుక జాయింట్ సెక్రటరీ సిహెచ్ భాస్కర్, ఇసి మెంబర్ హేమేష్ తదితరులు పాల్గొన్నారు.

17న ఎపి జెఎసి ధర్నా

సాలూరు: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి జెఎసి అద్వర్యాన ఈనెల 17న ధర్నా నిర్వహించనున్నట్లు తాలూకా యూనిట్ చైర్మన్ ఎ.ప్రవీణ్ కుమార్ చెప్పారు. ఈ మేరకు టౌన్ పోలీస్ స్టేషన్‌లో అనుమతి కోరినట్లు తెలిపారు. ఉద్యోగ, ఉపాద్యాయుల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, దీనికి నిరసనగా దశలవారీ పోరాటం చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి తాలూకా యూనిట్ పరిధిలో ఉన్న ఉద్యోగులు ఉపాధ్యాయులు హాజరు కావాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

ఓటు హక్కుపై అవగాహన

సీతంపేట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓటు ప్రాముఖ్యత గురించి ఇన్చార్జి ప్రిన్సిపాల్ ప్రభాకర్ విద్యార్థులకు వివరించారు. 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని చెప్పారు. ఓటు హక్కు చాలా విలువైనదన్నారు. ఓటరు మంచి పాలకులను ఎంపిక చేసుకుని గెలిపించుకోవచ్చని అన్నారు. ఓటు హక్కు అనేది వజ్ర ఆయుధమని చెప్పారు. ఈ కార్యక్రమంలో బోధకులు శంకరరావు, తవుడు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణను కలిసిన అక్కివరపు

పార్వతీపురం : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గౌరవ మందకృష్ణ మాదిగను గురువారం హైదరాబాదులోని వారి నివాసంలో ఉత్తరాంధ్ర ప్రజా సంఘాల జేఏసీ నాయకులు అక్కివరపు మోహన్‌రావు మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో దళితులు, అణగారిన వర్గాల సమస్యల పైన గతవారం సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణ అంశంపై జరిగిన వాదనపై చర్చించామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి తిప్పారపు లక్ష్మణ్ మాదిగ తదితరులు ఉన్నారు.

మందకృష్ణ మాదిగను కలిసిన మోహనరావు

మండుతున్న ఎండలు

గుమ్మలక్ష్మీపురం: గత మూడు రోజులుగా మండలంలో ఎండలు తీవ్రత రోజురోజుకు అధికమవుతుంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఎండల ప్రభావంతో రోజువారి ఉష్ణోగ్రత 36 డిగ్రీల వరకు నమోదవుతుంది. ఫిబ్రవరిలోనే ఎండలు మండిపోతుంటే మార్చి, ఏప్రిల్, మే నెలలో మరింత తీవ్రత ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండల ప్రభావంతో ఉపాధి హామీ వేతనదారులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధి హామీ పనుల వద్ద టెంట్లు ఏర్పాటు చేయాలని, తాగునీరు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

ఆస్పత్రి భవనాలను త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి కొత్తగా నిర్మిస్తున్న భవనాలను త్వరగా పూర్తి చేసి రోగులకు మెరుగైన సేవలందించాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో పలువురు సభ్యులు సూచించారు. గురువారం స్థానిక భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన అభివృద్ధి కమిటీ సమావేశంలో పలువురు సభ్యులు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతానికి తలమానికంగా సుమారు రూ.9 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న నూతన భవనాలను త్వరగా పూర్తి చేసి అందించాలని కోరారు. అలాగే ఆసుపత్రిలో రోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వైద్యులు మానవతా దృక్పథంతో విధులు నిర్వహించి రోగులకు సేవలు చేయాలని కోరారు. ఆసుపత్రిలో గతంలో కంటే ప్రస్తుతం రోగులకు సేవలు పూర్తిగా అందుబాటులో ఉంటున్నాయని, అలాగే మందులు కూడా అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఆసుపత్రిలో పొరుగు సేవల సిబ్బంది కూడా క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య, అవుట్ పేషెంట్ల వివరాలను పరిశీలించారు. ఈ వేసవిని దృష్టిలో ఉంచుకొని ఆసుపత్రిలో తగినంత మందుల నిల్వలను ఉంచేలా వైద్యులు కృషి చేయాలని కోరారు. వేసవిలో విద్యుత్ సమస్య తలెత్తకుండా జనరేటర్ సౌకర్యాన్ని అందుబాటులో ఉంచాలని వైద్యులను కోరారు. సమావేశానికి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు వహీద్‌ఖాన్, సంధ్య, ఇన్చార్జి ఎంపిడిఒ జి.జగదీష్ కుమార్, ఆసుపత్రి సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ త్రివేణి, వైద్యులు రవికుమార్, రమ్య, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎనీమియా లేకుండా చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని గిరిజన గ్రామాలలో ఎనీమియా లేకుండా చర్యలు తీసుకోవాలని ఇన్చార్జి ఎంపిడిఒ జి.జగదీష్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశం మందిరంలో వైద్య ఆరోగ్యశాఖ, శిశు సంక్షేమ శాఖ, పంచాయతీ కార్యదర్శులు సిబ్బందితో ఏర్పాటు చేసిన కన్వర్జెన్సీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని ముఖ్యంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, ఆరోగ్య శాఖ సిబ్బంది గ్రామాలలో ఎనీమియా వ్యాధి లేకుండా తగు చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశాల మేరకు ప్రతి మండలంలోని మండల శాఖల అధికారులతో కన్వర్జెన్సీ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. స్త్రీ శిశుసంక్షేమ శాఖకు చెందిన సిడిపిఒ, సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు వారికి నిర్దేశించిన గ్రామాలకు వెళ్లి 0-1 సంవత్సరాల లోపు చిన్నారులను దత్తత తీసుకొని వారి బాగోగులను చూడాలన్నారు. తాడికొండ, రేగిడి, దుడ్డుకల్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది, ఏఎన్ఎంలు, హెల్త్ సూపర్వైజర్లు కూడా అప్రమత్తంగా ఉండి ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. గ్రామాలలో ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించి శుభ్రంగా ఉంచాలన్నారు.

దోమల నివారణకు చర్యలు : డిఎంఒ

ప్రజాశక్తి- సాలూరు

దోమల వ్యాప్తి నివారణ చర్యలు చేపట్టి, జ్వరాలు ప్రభావితం కాకుండా చూడాలని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి. జగన్‌మోహనరావు సూచించారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ ఆసుపత్రి ల్యాబ్‌లను గురు వారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రాల్లో ప్రతీ రోజూ ఎంతమంది రోగులు ఆరోగ్య తనిఖీల కోసం వస్తున్నారు, వారి ఆరోగ్య సమస్యల వివరాలను రికార్డులో తనిఖీ చేశారు. జ్వర లక్షణాలకు చేపడుతున్న నిర్ధారణ పరీక్షలు, వాటి నివేదికలను ల్యాబ్ రికార్డులో పరిశీలించారు. దోమల ఆవాస ప్రదేశాలను గుర్తించి వెక్టార్ కంట్రోల్ హైజీన్ యాప్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ఆ ప్రాంతంలో నివారణ చర్యలు చేపట్టాలని, డ్రైడే కార్యక్రమాలు పక్కాగా నిర్వహించాలని, అందుకు సంబంధిత శాఖల సమన్వయం అవసరమని చెప్పారు. క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు ఆరోగ్య సర్వే చేపట్టాలన్నారు. ప్రాంతీయ ఆసుపత్రి ల్యాబ్‌లో రికార్డులు పరిశీలించి జ్వరాల వివరాలు ఐహెచ్ఐపి పోర్టల్‌లో నమోదు చేయాలని, ఏ ప్రాంతానికి చెందినవీ తెలియజేయాలని సూచించారు. అనంతరం డాక్టర్ జగన్ మోహనరావు మున్సిపల్ కమిషనర్ పి. ప్రసన్నవాణితో సమీక్ష జరిపారు. దోమల వ్యాప్తి నివారణ చర్యలు, పారిశుధ్య కార్యక్రమాల అంశాలపై చర్చించారు. వీటిని మెరుగు పరిచే దిశగా ఆయా వార్డుల్లో సచివాలయ, వైద్య సిబ్బంది సమన్వయం అవసరమన్నారు. అనంతరం ఆయన కూర్మరాజు పేటలో హెల్త్ వెల్నెస్ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎఎంఒ సూర్యనారాయణ, వైద్యాధికారులు డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ ఎ.ప్రియాంక, సబ్ యూనిట్ అధికారి ఎం.ఈశ్వరరావు, హెల్త్ సూపర్ వైజర్ కె.లక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సాలూరు: రికార్డులను పరిశీలిస్తున్న జగన్‌మోహన్‌రావు

సీతానగరం: హెల్త్ వెల్నెస్ కేంద్రాల్లో గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా మలేరియా అధికారి టి.జగన్ మోహనరావు అన్నారు. గురువారం స్థానిక పిహెచ్‌సిలో క్షేత్ర స్థాయి సిబ్బందితో నిర్వహించిన సమావే శంలో ఆయన కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. ప్రజారోగ్యం దృష్ట్యా ప్రభుత్వం నిర్దేశించిన అన్ని ఆరోగ్య కార్యక్రమాలను, వైద్య సదుపాయాలను ప్రజలకు పూర్తి స్థాయిలో వినియో గించాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో హెల్త్ వెల్నెస్ కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. ఆరోగ్య తనిఖీల వివరాలు, నివేదికలు నిర్దేశించిన రికార్డుల్లో పక్కగా నమోదు చేయాలని ఆదేశించారు. జ్వర లక్షణాలు గుర్తిస్తే వెంటనే నిర్ధారణ పరీక్షలు జరపాలని, రక్త నమూనాలు సేకరించాలని సూచించారు. అనంతరం పిహెచ్‌సి ల్యాబ్‌లో కొత్తగా ఇన్‌స్టాల్ చేసిన సిబిసి ఎనలైజర్ రక్త పరీక్షల పరికరం పనితీరును గమనించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పావని, ఎఎంఒ సూర్యనారాయణ, సిహెచ్ఒ ఎస్‌వి రమణ, సూపర్‌వైజర్ భవాని, ఎఎన్ఎంలు, సిహెచ్‌ఒలు, హెల్త్‌అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి- సీతంపేట

మండల కేంద్రానికి చుట్టు పక్కల గ్రామాలకు శుక్రవారం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఎఇ జి నీలిమ తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ మరమ్మత్తులు, లైన్ ఏ,బి స్విచ్ పనులు, మరమ్మతుకు గురైన స్తంబాలను మార్చడం వల్ల ఈ అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని ఆమె కోరారు.

వీరఘట్టం, నవగాం పరిధిలో..

వీరఘట్టం: పాలకొండ సబ్ డివిజన్ పరిధిలోని వీరఘట్టం, నవగాం విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలో మెయింటినెన్స్ నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు పాలకొండ సబ్ డివిజన్ ఏడి టీజీకే మూర్తి గురువారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపి వేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు. మరమ్మతు పనులు పూర్తియిన తరువాత విద్యుత్తును సరఫరా చేస్తామని స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే జోగారావు చర్చకు రావాలి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగా రావు అవినీతి, అక్రమాలపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, తనతో పాటు, టిడిపి నాయకులపై చేసిన అవినీతిపై చర్చకు రావాలని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బోనాల విజయ్ చంద్ర డిమాండ్ చేశారు. గురువారం టిడిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్లగా పార్వతీపురంలో ఎమ్మెల్యే జోగారావు అవినీతి గురించి నియోజకవర్గంలో ఏ ఒక్క పౌరుడిని అడిగిన వివరాలతో సహా చెబుతారని దబాయించినంత మాత్రాన నిజం అబద్ధం కాదన్నారు. ఆయన అవినీతిపై తమ దగ్గర ఆధారాలతో కూడిన పూర్తి సమాచారం ఉందన్నారు. నర్సిపురంలో పుట్టినందుకు గాను ఈ ప్రాంతానికి సేవ చేయాలన్న ఆశయంతో రాజకీయాలకు వచ్చానని, నియోజకవర్గాన్ని దోచుకోవడానికి రాలేదని అన్నారు. ఎవరు ఎంత దోచుకున్నారో అన్నది చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, అందుకు ఎమ్మెల్యే కూడా సిద్ధం కావాలని సవాల్ విసిరారు. పార్వతీపురంలో ఉన్న ప్రతి బందని నీ అనుచరులతో కబ్జా చేయించిన విషయం ప్రజలకు తెలుసునని, నియోజకవర్గంలో ఉన్న ఏ ప్రభుత్వ భూమిని విడిచి పెట్టలేదని, జగనన్న లేఔట్‌లో వందేసి గజాలు, కార్యకర్తలకు, నాయకులకు ఎలా కట్టబెట్టారో ప్రజలకు సాక్ష్యాలతో సహా నిరూపించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు బోన్ చంద్రమౌళి, నాయకులు కోరాడ నారాయణరావు, బి.సీతారాం, గొట్టాపు వెంకటనాయుడు, వెంకటేష్ పాల్గొన్నారు.

జనసేన మండల కమిటీలు ఏర్పాటు

ప్రజాశక్తి - మక్కువ

సాలూరు నియోజకవర్గంలో జనసేన పార్టీ వివిధ విభాగాలకు సంబంధించి మండల కమిటీలను నియమించింది. ఈ కమిటీలను జనసేన పార్టీ జిల్లా ఇన్చార్జి లోకం మాధవి, సాలూరు నియోజకవర్గ సమన్వయకర్త గేదెల రిషివర్ధన్ ఆధ్వర్యంలో గురువారం ప్రకటించారు. మక్కువ మండలంలో ఒక అధ్యక్షుడు, ఇద్దరు ఉపాధ్యక్షులతో పాటు 16 మంది కమిటీ సభ్యుల పేర్లను ప్రకటించారు. మండల అధ్యక్షులుగా గేదెల రిషివర్ధన్, ఉపాధ్యక్షులుగా వెంపడాపు సుగుణేశ్వరరావు, గొట్టాపు వెంకటేష్, ప్రధాన కార్యదర్శులుగా బోను పాపారావు యాదవ్, సింగనాపురి బంగారాజు, కొయ్యన జగదీష్, చింతల నరేష్, కార్యదర్శులుగా సాలాపు జగదీష్, అల్లు శంకర్, కర్రి వినోద్ కుమార్, వంగపండు మధు, రౌతు విశ్వేశ్వరరావు, అలజంగి వసంత్ కుమార్, రౌతు మణికంఠ, సామంతల అప్పలనాయుడు, కేత రాంబాబు, మండంగి సంజీవ్, షేక్ రహీం, దుర్గాప్రసాద్, పేర్లను ప్రకటించారు. వీటితోపాటు ప్రోగ్రాం కమిటీ విభాగంలో సాలాపు జగదీష్, చింతల నరేష్, వంగపండు మధు, సామంతుల అప్పలనాయుడు నియమితులయ్యారు. ప్రచార కమిటీలో భాగంగా అల్లు శంకర్, కర్రి వినోద్‌ను నియమించారు. ఎస్సి సెల్ కోఆర్డినేటర్, ప్రింట్ మీడియా కోఆర్డినేటర్‌గా సింగనాపురి బంగార రాజును నియమించగా ఎస్‌టి సెల్ కోఆర్డినేటర్‌గా మండంగి సంజీవ్, బీసీ సెల్ కోఆర్డినేటర్‌గా బోను పాపారావు యాదవ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ అలజంగి వసంత్ కుమార్‌ను నియమించారు. కమిటీ సభ్యులతో జిల్లా ఇన్చార్జి లోకం మాధవి మాట్లాడుతూ మండలంలో జనసేన పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లి మరింత బలోపేతం చేయాలని కోరారు.

నేటి నుంచి వాలంటీర్లకు వందనం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని 21గ్రామ సచివాలయాల పరిధిలోని 314మంది వాలంటీర్లకు వందనం కార్యక్రమం ద్వారా సత్కరించనున్నట్టు ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు తెలిపారు. మండలంలోని తామరఖండి, బగ్గందొర వలస, గెడ్డలుప్పి గ్రామ సచివాలయం పరిధిలోనిశుక్రవారం వాలంటీర్లను తామరఖండిలో సత్కరిస్తామన్నారు. ఎమ్మెల్యే జోగారావు ముఖ్య అతిథిగా, ఎంపిపి, జెడ్పీటిసి తదితర ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఇదిలా ఉండగా మండలంలోని ఇద్దరు సేవావజ్రకు ఎంపికయ్యారని తెలిపారు. గాదెలవలసకు చెందిన బొన్నాడ సీతంనాయుడు, బూర్జకు చెందిన కోరిపల్లి లక్ష్మిలకు సేవావజ్ర ద్వారా రూ.45వేలు నగదుతో పాటు సత్కరిస్తామని తెలిపారు. చినభోగిలి, వెంకటపురం, బల్లకృష్ణాపురం, గుచ్చిమి, సూరంపేట గ్రామ పంచాయతీలకు చెందిన ఆచంటి భాగ్యలక్ష్మి, తోట రమణ, కొండూరు అశోక్, పెంకి సుకుమార్, మరడాన లక్ష్మిలు సేవా రత్నలకు ఎంపిక కాగా వారికి ఒక్కొక్కరికి రూ.30వేలు నగదుతో పాటు సత్కారం చేయనున్నట్టు తెలిపారు. మిగిలిన 307మంది వాలంటీర్లను సేవామిత్ర ద్వారా రూ.15వేలు నగదుతో పాటు సత్కారం చేయనున్నట్టు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా మండలంలోని నిర్మాణం పూర్తయిన తామరఖండి సచివాలయం భవనం శుక్రవారం, పెదబొగిలి-1, 2 సచివాలయ భవనాలు శనివారం ఎమ్మెల్యే జోగారావు ప్రారంభిస్తారని ఎంపిడిఒ తెలిపారు.

అబద్ధాల ఘనాపాటి విజయచంద్ర

ఎమ్మెల్యే అలజంగి జోగారావు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

స్థాని నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బోనెల విజయచంద్ర తనపై చేసిన ఆరోపణలను ఎమ్మెల్యే అలజంగి జోగారావు తిప్పికొట్టారు. గురువారం ఆయన మాట్లాడుతూ బోనెల విజయచంద్ర అబద్ధాలు ఆడటంలో ఘనాపాటి అని, సొంత ఊరికి సేవ చేసేందుకు వచ్చానని చెప్పే ఆయన నరిసిపురంలో 2019లో ఓటు ఎందుకు లేదని ప్రశ్నించారు. ఇప్పుడెందుకు మూడు నెలల ముందు వెంకంపేట పోలింగ్ బూత్‌లో నమోదు చేసుకున్నారని ప్రశ్నించారు. ఇప్పుడే ఇన్ని అబద్ధాలు చెప్పేవాడిని, మున్ముందు ఇంకెన్ని అబద్ధాలు చెప్పి పార్వతీపురం ప్రజలను నట్టేట ముంచుదాం అనుకుంటున్నారని అన్నారు. టిడిపి నాయకుడు బర్నాల సీతారాం పట్టణంలో ఆక్రమించిన ప్రభుత్వ స్థలాన్ని చూపుతామని , జెసిబితో దాన్ని కూల్చి ప్రభుత్వ పరం చేయాలని అన్నారు. గతంలో విజయ చంద్ర చేసిన వివిధ సంఘాలు, వ్యక్తులకు మోసగించి కోట్లాది రూపాయల స్కాముల పూర్తి బండారాలు, అక్రమ ఆర్థిక లావాదేవీల అకౌంట్లుతో సహా త్వరలో ప్రజల ముందు ఉంచుతామని తెలిపారు. నా అభివృద్ధి గురించి నియోజకవర్గంలోఏ ఊరు వెళ్లినా అక్కడ ప్రజలు చెబుతారని అన్నారు.

రోగులను పరామర్శించిన భూదేవి

సీతంపేట : స్థానిక ఏరియా ఆసుపత్రిలో రోగులను పాలకొండ నియోజకవర్గం టిడిపి నాయకులు నారీ శక్తి అవార్డు గ్రహీత పడాల భూదేవి గురువారం రాత్రి సందర్శించారు రోగులను పరామర్శించారు గిరిజన రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాఅన్నారు సకాలంలో వైద్య సేవలు అందించాలని కోరారు గ్రామాల్లో పోస్ట్కాహారం లోపం వలన రక్తహీనతకే గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారుజ గిరిజనులకు విద్యార్థులకు, గర్భిణీలకు చిన్నారులకు బాలింతలకు మంచి పౌష్టికాహారం అందించాలని అన్నారు . ఏరియా ఆసుపత్రిలో రోగులకు అవసరమైన టెస్టులు అన్ని వైద్య సేవలు ఉండాలని అన్నారు.మందులు కొరత లేకుండా చూడాలన్నారు.

రోగులతో మాట్లాడుతున్న భూదేవి